
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 21 జూలై 2025

ఉపాధ్యాయుల 'సర్దుబాటు' వివాదం..



- ప్రభుత్వ జాబితాను తప్పుపడుతున్న టీచర్లు, గ్రామస్థులు
- ఇష్టారాజ్యంగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారని ఆరోపణలు
- మల్లాపూర్‌లో రోడ్డెక్కిన తల్లిదండ్రులు
- జిల్లాలో 222 మంది సర్దుబాటు



మల్లాపూర్ మండలం రేగుంటలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు(ఫైల్)

జగిత్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జిల్లాలో వివాదాస్పదమవుతోంది. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేక, విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదురవుతుండడంతో ప్రభుత్వం ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జిల్లా విద్యాశాఖ నాలుగు రోజుల క్రితం 222 మంది ఉపాధ్యాయులతో సర్దుబాటు జాబితాను విడుదల చేసింది. సర్దుబాటు జాబితా తప్పుల తడకగా రూపొందించారంటూ పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనికి తోడు ప్రజాప్రతినిధులు, నాయకుల జోక్యంతో పలు చోట్ల వివాదాలు ముదురుతున్నాయి. ఈ వ్యవహారం జిల్లా విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు సర్దుబాటు మినహాయింపు కోరుతూ డీఈవో, ఎంఈవో కార్యాలయాలకు క్యూ కడుతున్నారు.

● సీనియారిటీ పట్టించుకోలేదని ఆవేదన

రాష్ట్ర విద్యాశాఖ మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారులు 222మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ జాబితా రూపొందించారు. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుల సీనియారిటీ, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని పలువురు ఉపాధ్యాయులు వాదిస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులను ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు తాత్కాలికంగా సర్దుబాటు చేశారు. దీనిపై పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల సర్దుబాటు జాబితాను ఆయా మండలాల ఎంఈవోలు ఇచ్చిన సమాచారం మేరకు సిద్ధం చేశారు. తొలుత ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సర్దుబాటు, మలి విడతలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితాను రూపొందించాలని ప్రయత్నించారు. అయితే పలు చిక్కులు ఎదురుకావడంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులందరితో కలిపి సర్దుబాటు జాబితాను రూపొందించారు.

● అవసరమైన చోట ఉపాధ్యాయులు లేక ఇక్కట్లు..

పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు పైగా గడిచింది. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరడంతో పలు ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయి. అయితే పలు ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ వివాదస్పదం కావడంతో క్షేత్ర స్థాయిలో అవసరమైన చోట ఉపాధ్యాయులు లేక అటు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఇటుఎంఈవోలు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో నెలకొన్న కొన్ని వివాదాలు..

- మల్లాపూర్ మండలం రేగుంట పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలిని గ్రామానికన్నా తక్కువ విద్యార్థులున్న ఇతర పాఠశాలకు సర్దుబాటు చేశారని ఆరోపిస్తూ ప్రధాన రహదా రిపై బైఠాయించి రాస్తారోకో చేశారు.
- ఎండపల్లి మండలంలోని ఓ పాఠశాల నుంచి ఇంకో పాఠశాలకు సర్దుబాటు అయిన ఉపాధ్యాయుడు ఒకరు ఉత్తర్వుల నుంచి మినహాయింపు కోసం ఇటీవల ఓ ప్రజాప్రతినిధితో అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.
- నిబంధనలకు విరుద్ధంగా దూర ప్రాంతానికి చెందిన తనను పెగడపల్లి మండలానికి సర్దుబాటు చేశారని, తనకు మినహాయింపు ఇవ్వాలని ఓ ఉపాధ్యాయురాలు డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది.
- ఇబ్రహీంపట్నం మండలం నుంచి జగిత్యాల అర్బన్‌కు ఓ ఉపాధ్యాయున్ని, రాయిల్ మండలం నుంచి వెల్గటూరు మండలానికి ఒక ఉపాధ్యాయున్ని, మెట్‌పల్లి మండలం నుంచి జగిత్యాల పట్టణానికి ఒక ఉపాధ్యాయుడిని, సారగపూర్ మండలం నుంచి కోరుట్ల మండలానికి ఒక ఉపాధ్యాయుడిని నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేశారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

● ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిళ్లు..?

సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా వాస్తవ పరిస్థితులు ఆధారంగా సర్దుబాటును..

మిగతా 8లో...

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ క్రీడాకారులతో ఎస్సై సతీష్

బుగ్గారం, జూలై 20(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బుగ్గారం ఎస్సై గొంగటి సతీష్ అన్నారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆట స్థలంలో ఎస్సై ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల యువత వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనాలని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి బహుమతితో పాటు జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సాజిత్, శేఖర్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు సిగిరి అంజిత్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు అంతర్గాం విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని పూజను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య

జగిత్యాలరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని అంతర్గాం ఉన్నత పాఠశాల విద్యార్థిని అల్లెపు పూజ జూనియర్ వాలీబాల్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వర్‌రావు తెలిపారు. ఈనెల 22న గద్వాల జిల్లా ఉత్తునూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పూజ పాల్గొంటుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని పూజను వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వర్‌రావు, బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, సెక్రెటరీ విశ్వప్రసాద్, ప్రధానోపాధ్యాయులు సత్తయ్య అభినందించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

బీమారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీమారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఈజీఎస్ నిధులు రూ.4లక్షలతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చెక్కపెల్లి శంకర్, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోపాల కాలువలు



గోపాల కాలువలు నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

ధర్మపురి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ రామానందేశ్వర స్వామి గద్దె ఆధ్వర్యంలో గోపాల కాలువలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఏటా నిర్వహించే విధంగా గోదావరి నది నుంచి తీసుక వచ్చిన జలాలతో పురాతన శ్రీ రామానందేశ్వర స్వామి ఆల యంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఇందారపు లక్ష్మీకాంతం, మునిగాల కిషన్, బొజ్జ శంకర్, బాయి మురళి, పురాణపు సాంబమూర్తి, ఇందారపు రాంకిషన్, రావులపెల్లి వెంకట రమణ, పనతుల శ్రీధర్, సంగనభట్ల దత్తాత్రి ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక క్షేమం, విశ్వశాంతి కోసం గంటల తరబడి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివుడికి మధ్యాహ్నం అన్నపూజ అనంతరం భక్తి పాటలు పాడుతూ భజనలు చేస్తూ ఊరేగింపుగా గోదావరి నదికి బయలు దేరారు. దారి పొడవుగా మహిళలు బిందెలతో నీరు తీసుకు వచ్చి బ్రాహ్మణులపై పోసి వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఇందారపు లక్ష్మీకాంతం, మునిగాల కిషన్, మధ్వాచారి రాంకిషన్, బొజ్జ శంకర్, బాయి మురళి, పురాణపు సాంబమూర్తి పాల్గొన్నారు.

వెలమ సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి

జగిత్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వెలమ సంఘం సభ్యుల సంక్షేమానికి అవసరమైన కృషి చేస్తున్నామని జగిత్యాల వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి దన్నపునేని వేణుగోపాల్ రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని వెలమ సంక్షేమ సంఘ భవనంలో పలువురు బాధిత కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కులు, ఆర్థిక సహాయాన్ని అందించారు. గత యేడాది ప్రమాదవశాత్తు మృతి చెందిన మనోజ్‌రావు కుటుంబ సభ్యులకు రూ.లక్ష ప్రమాద బీమా చెక్కున అందించారు.

కార్యక్రమంలో జగిత్యాల వెలమ సంక్షేమ మండలి నాయకులు బండారి దివాకర్, వెన్నమనేని కృష్ణ, అయిల్నేని రవీందర్, మేన్నేని సురేందర్, యామనేని అజయ్, ప్రవీణ్, రాంప్రసాద్, అయిల్నేని శ్రీలత, నేషనల్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ అధికారి రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం సౌదికి వెళ్లి ఇటీవల మృతి చెందిన పట్టణంలోని సాయిరాం నగర్ కాలనీకి చెందిన బోగ మనోహర్ కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయిరాంనగర్ కాలనీలో గల బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధి నిమిత్తం వెళ్లి మనోహర్ విదేశంలో మృతి చెందడం బాధాకర మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేసేలా కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీశ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 250 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ నబంధనల ప్రకారం ఉద్యోగులకు 3 లక్షలు, పెన్షనర్‌లకు 2 లక్షల రుపాయల వరకు వైద్య ఖర్చులు చెల్లించాల్సి ఉండగా ఏడాదికి పైగా బకాయిలు చెల్లించక పోవడంతో క్యాన్సర్, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారు కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులను వెంటనే చెల్లిం చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, పిసి హన్మంత రెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్లుల ప్రకాశ్ రావు, ఎండి యాకూబ్, పి. అశోక్, కె. సత్యనారాయణ, పబ్బా శివానందం తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని పాదయాత్ర 7

శిథిలావస్థలో ప్రయాణ ప్రాంగణం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు 8

ఐఎంఏ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

జగిత్యాలరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తిప్పన్నపేట శివారులో గల ఎస్‌కెఎన్‌ఆర్ మైదానంలో జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో డాక్టర్ రామకృష్ణ టీం, డాక్టర్ జైపాల్‌రెడ్డి టీంలు తలపడగా రామకృష్ణ టీం పై జైపాల్‌రెడ్డి టీం విజేతగా నిలిచింది.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి



నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల, నాయకులు

జగిత్యాల అర్బన్ జూలై 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలో స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రబుద్ధ భారత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి అమూల్యమైన సేవలు అందించారని అన్నారు. ప్రతి ఆదివారం నిమ్న వర్గాలకు సంబంధించిన ఒక ఆర్టికల్‌పై వివరణ చెప్పుకోవాల్సిందిగా ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో డిక్కీ జిల్లా కో ఆర్డినేటర్ నల్ల శ్యాం, ఓరుగంటి రమణారావు, మేనేని రవీందర్ రావు, గోస్కుల జలందర్, మాధవరావు, బొల్లం రమేష్, నేరెళ్ల గంగారెడ్డి, తక్కళ్ళ దేవయ్య, బొట్ల విజయ్ రతన్, బత్తుల ప్రదీప్‌రావు, బొల్లం ప్రభాకర్, జవ్వాజి శంకర్, అయిల్నేని ఆనందరావు, పొనగంటి రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అభినందనీయం

●ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ రాజేందర్



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అతిథులు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): వాల్మీకి సేవా భారతి ఆధ్వర్యంలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ ఆకు రాజేందర్, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ జయంతి అన్నారు. ఈశిక్షణ ద్వారా మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వారు తెలిపారు. వాల్మీకి ఆవాసం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రం, ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ద్వారా శిక్షణ పొందిన 150మందికి ఆదివారం వాల్మీకి ఆవాసంలో కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్, డాక్టర్ జయంతిలు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసం ద్వారా ఎంతో మంది నిరుపేద విద్యార్థులు వివిధ హోదాల్లో స్థిరపడడం ఆనందదాయకం అన్నారు. మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ, కంప్యూటర్ శిక్షణ అందించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమేకాకుండా, ఆర్థిక స్వాలంబన కలిగించే దిశగా ఆవాస నిర్వాహకులు అడుగులు వేయడం అభినందనీయం అన్నారు. సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనందించేందుకు సేవాభారతి వివిధ రకాల వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ అందిస్తుందన్నారు. సేవాభారతి నిర్వహించే కార్యక్రమాలకు సమాజంలోని ప్రతి వ్యక్తి తమవంతు చేయూతనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ్‌చాలక్ డాక్టర్ భీమనాతి శంకర్, సేవా భారతి అధ్యక్షులు ఎస్పీ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, రవీందర్‌రాజు, ఆవాస కార్యదర్శి మదన్‌మోహన్, కమిటీ సభ్యులు అశోక్‌రావు, సంపూర్ణచారి, హరీష్, మధుకర్, వెంకటేశ్వర్‌రావు, సత్యం, మల్లేశం తదితరులున్నారు.

వైభవంగా ఆషాఢమాసం బోనాలు



మల్యాలలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

జగిత్యాల క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం గోవిందు పల్లి, హరిహర నగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, వంజరి వాడ కాలనీ వాసుల ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో పాటు కాంగ్రెస్ నాయకులు వేడుకల్లో పాల్గొని పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొలగాని ప్రేమలత సత్యం, గాజుల రాజేందర్, అల్లాల సరిత రమేష్ రావు, పుప్పాల అశోక్ తదితరులు ఉన్నారు.

●కోరుట్ల: పట్టణంలోని పలు కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆషాడమాస వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని పలు గ్రామ దేవతల దేవాలయాలలో మహిళలు బోనాలను సమర్పించారు.

●కోరుట్ల రూరల్: మోహన్‌రావుపేట గ్రామంలో గెండెలమ్మ ఉత్సవ మూర్తితో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

●మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని వంజరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఐదు చేతుల పోచమ్మ తల్లికి డబ్బు చప్పులతో మహి ళలు మొక్కులు చెల్లించుకొని నైవేద్యం సమర్పించారు.ఈ కార్యక్రమంలో వంజరి సంఘ అధ్యక్షుడు బొమ్మెల శివ, సెక్రెటరీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

●పట్టణ శివారులోని మహాలక్ష్మీ అమ్మవారికి సుభాష్ యూత్ సభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బొడ్ల గౌతమ్, జెట్టి రూపేష్, బొడ్ల అనిల్,సంగు ప్రతాప్, బొడ్ల సాగర్ పాల్గొన్నారు.

●మల్యాల: మల్యాలలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో బాగంగా ఆదివారం మహిళలు బోనాల వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. పురోహితులు సంతోష్‌శర్మ, ప్రణీత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు.

●కొడిమ్యాల: మండలంలోని నాచుపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్థులు పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, మాజీ సర్పంచ్ లతతిర్మలేష్ పాల్గొన్నారు.



గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు

రోడ్డు ప్రమాదంలో సైకిలిస్టు మృతి

జగిత్యాల క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో రోడ్డు ప్రమాదంలో ఆదివారం సైకిలిస్టు పోచంపెల్లి పోచరాజు(48) అనేవ్యక్తి మృతిచెందాడు. గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామానికిచెందిన పోచంపెల్లి పోచరాజు ఉపాధి కోసం జగిత్యాల పట్టణానికి వలసవచ్చి కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం పోచరాజు తనఇంటి నుంచి సైకిల్‌పై కొత్త బస్టాండ్ వైపు వెళ్తుండగా కరీంనగర్ వైపు వెళ్తున్న భారీ క్రేన్ ఢీకొని మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రదీప్ కుమార్ అనేవ్యక్తి అజాగ్రత్తగా క్రేన్‌ను నడుపుతూ పోచరాజు నడుపుతున్న సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో పోచరాజు కిందపడగా అతడి తలపై నుంచి క్రేన్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామానికిచెందిన మత్తమర్రి మొండయ్య(75) అనేవృద్ధుడు మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మొండయ్య ఆదివారం మృతిచెందాడు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుప త్రిలో పోస్టుమార్టం చేశారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కొడిమ్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన చిలువేరు అశోక్(36) అనే యువకుడు కరీంనగర్‌లోని ప్రైవేటుఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. తనకు పెళ్లి కావటం లేదని అశోక్ మనస్థాపానికి గురై ఈనెల 10న గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి నర్సింహరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


పొలం వద్ద మృతిచెందిన మహేందర్

కోనరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన అనుముల మహేందర్ (45) అనేరైతు తన పంటపొలంలో పశువుల మేతకోసం గడ్డి కోయడానికి వెళుతున్నానని భార్య మమతకు చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా కలవకపోవడంతో ఆదివారం రాత్రి పంటపొలం వద్దకు వెళ్లిచూడగా విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు గుర్తించారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మమత, కూతురు, కుమారుడు ఉన్నారు.

ఇసుక లారీల పట్టివేత

ఇబ్రహీంపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10లారీలను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్రావుపేట, సత్తక్కపల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్63 రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకున్నామన్నారు. బండలింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను పట్టుకున్నామన్నారు. మెట్‌పల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాంతయ్య ఫిర్యాదు మేరకు లారీల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు ఊడిపోయి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు ముందు టైర్ ఆదివారం ఊడిపోయింది. వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామంలోని ప్రశాంత్ తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేట వైపు నుంచి రాచర్లగొల్లపల్లికి వెళుతున్నారు. హెచ్‌పీ బంకు సమీపంలోకి చేరుకోగానే వాహనం ముందు టైర్ ఊడిపోయింది. కారు ముందు భాగం దెబ్బతింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శనివారం తెలిపారు. గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు ఈనెల 19న రాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామని పేర్కొన్నారు. తమ రాకను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయారని చెప్పారు. మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7600 నగదుతో పాటు పేకాట ముక్కలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఓబులాపూర్ గ్రామ శివారులో..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామ శివారులోని పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారినుంచి రూ.23వేల నగదును స్వాధీనం చేసుకుని, రెండు ద్విచక్ర వాహ నాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వ ధ్వంసం

జమ్మికుంట రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని 629సర్వే నంబర్‌లోగల ఎస్సారెస్పీ కాల్వను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇప్పటికే ఆ ప్రాంతంలోని ప్రభుత్వభూమి కబ్జా గురవుతోంది. మొత్తం కాల్వను ధ్వంసం చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇంత జరిగినా ఎస్సారెస్పీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


ధ్వంసం అయిన ఎస్సారెస్పీ కాల్వ

వెల్‌నెస్ సెంటర్‌లో అరకొరగా మందులు

● ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు



సుభాష్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రి ఆవరణలోని వెల్‌నెస్ సెంటర్‌లో అరకొర మందులతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయుల కోసం 2018 జూన్ 28న జిల్లా జనరల్ ఆసుపత్రిలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌కు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు వైద్యం కోసం వస్తుంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వెల్‌నెస్ సెంటర్‌లో సేవలు అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో 23 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తొమ్మిది వేలు, జర్నలిస్టులు 1500 మంది ఉన్నారు. వైద్యం కోసం వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చినవారు సంబంధిత డాక్టరుకు చూపించుకున్న తరువాత డాక్టరు రాసిన మందులు అక్కడ అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. మందులు స్థానిక మెడికల్ ఏజన్సీల నుంచి సరఫరా చేస్తున్నా, వాటిని మంజూరు చేసేది హైదరాబాద్‌లోనే. వెల్‌నెస్ సెంటర్ వారు మందులు కావాలని ఇండెంట్ పెడితే సంబంధిత అధికారి సెలవులో ఉంటే మందులు రావడం మరింత ఆలస్యం అవుతోంవది. బీపీ, షుగర్‌తోపాటు ఇతర వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల నొప్పులు ఇతర శారీరక నొప్పులకు సంబంధించిన ఆయింట్‌మెంట్‌కూడా అందుబాటులో లేకపోవడం శోచనీయమని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● బీపీ, షుగర్ బాధితులే ఎక్కువ...

వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చేవారిలో బీపీ, షుగర్, థైరాయిడ్ బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్లు, సిబ్బంది సరిపడా ఉన్నప్పటికి మందులు మాత్రం అందుబాటులో ఉండడంలేదు. మూడు నెలలకు ఒకసారి మందులకు సంబంధించిన ఇండెంట్ పెడతారు. ఆ మందులు వచ్చేలోగా అప్పటి వరకు ఉన్న మందులు అయిపోతున్నాయి. ప్రతినెల ఎంతమంది బీపీ, షుగర్, థైరాయిడ్ పేషంట్లు వస్తు న్నారు, వారికి ఎన్ని మందులు అలవసరమనే విష యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇండెంట్ పెడుతున్నామని సిబ్బంది అంటున్నారు. అవి రావడంలో ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు చెబుతున్నారు. సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికే యులు కోరుతున్నారు.

అన్ని మందులు అందుబాటులో ఉంచాలి...

-దారం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు



డాక్టర్లు రాసిన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్నారు. డయాబెటిస్ పేషంట్లకు ఇన్సులిన్, బీపీకి సంబంధించిన మందులతోపాటు, గుండెకు సంబంధించిన మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి. వెల్‌నెస్ సెంటర్‌లో స్పెషలిస్టులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుండె, నరాలకు సంబంధించిన మందులను వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉంచాలి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలు

సుల్తానాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గట్టేపల్లి గ్రామానికిచెందిన వజీర్ ఆదివారం రాత్రి బైక్‌పై పెద్దపల్లి రోడ్డులో గల పెట్రోల్‌బంకువద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వజీర్ తీవ్రంగా గాయపడగా పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో మల్యాలకుచెందిన బావు చంద్రయ్యకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన కె ఆంజనేయులు మే27న తన సెల్‌ఫోన్‌ను ఆరేపల్లి దగ్గర పోగొట్టుకున్నాడు. కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీతో జగి త్యాలలోఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపిస్తున్న త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డుకాలనీ గౌతమ్ మెడికల్ షాపులో జరిగిన చోరీ కేసులో నిందితులను త్రీటౌన్ పోలీసులు అరెస్టుచేశారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ జాన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఈ నెల 16న గౌతమ్ మెడికల్ షాపులో జరిగిన చోరీలో రూ.3 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు హౌసింగ్‌బోర్డు కాలనీలో అద్దెకు ఉంటున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సబ్బీర్ ఆలం అలియాస్ అజ్మల్ హుస్సేన్ అలియాస్ సకీర్ చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. గతంలో సిద్దిపేటలో ఒక హోటల్‌లో పని చేసిన్నప్పుడు అతడికి పరిచయమైన బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ రిజ్వాన్ ఆలం, మహ్మద్ ఫర్హాన్ ఆలంను పిలిపించుకొని వారితో కలిసి దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడించాడు. వీరు గతంలో జరిగిన పలు దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు, ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై జగదీశ్వర్, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు సాయినేత్ర, ప్రశాంత్‌ను అభినందించారు.

బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగునూర్ శివారులోని కాకతీయకాలువ పక్కన ఈనెల 18న ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించిన నిందితుడైన బాలిక మేనమామను ఆదివారం పట్టుకున్నట్లు తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. బోయిన్‌పల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే బోయిన్‌పల్లిలో రౌడీషీట్ ఉందని సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ను సీఐ సదన్ కుమార్‌తోపాటు ఇతర పోలీస్ అధికారులు అభినందించారు.

ఇంటర్ చదువుకు విద్యార్థుల అవస్థలు

● మండలంలో జూనియర్ కాలేజీ లేక ఇబ్బందులు


బస్సెక్కి కాలేజీకి వెళుతున్న విద్యార్థులు

గన్నేరువరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజు కరీంనగర్‌కు 40కిలోమీటర్ల దూరం ప్రయాణించి చదువుకుంటున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ఆర్టీసీ, కాలేజీల బస్సులలో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు పక్కనున్న ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలకు వెళుతున్నారు. ఇల్లంతకుంటకు నేరుగా బస్సుసౌకర్యం లేకపోవడంతో పొత్తూరు వరకు వెళ్లి అక్కడి నుంచి మరోబస్సు ద్వారా ఇల్లంతకుంటకు వెళుతున్నారు. ప్రతిరోజు ఇలా విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీకి అనువైనస్థలం ఉంది. అక్కడ కాలేజీ ఏర్పాటు చేయాలని గతంలో నివేదికలు పంపినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడంలేదు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అప్పటి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కళాశాలల్లో డ్రగ్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించండి

● రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


ఎల్ఎండీలోని అతిథి గృహం వద్ద సీఐ సదన్‌కుమార్‌కు సూచనలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో డ్రగ్స్‌పై విద్యార్థులకు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించాలని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌ను రాష్ట్ర ఐటీశాఖమంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆదివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో నీటిపారుదలశాఖ అతిథి గృహంలో కాసేపు ఆగిన మంత్రి అక్కడే ఉన్న కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి, తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌తో మాట్లాడారు. డ్రగ్స్‌పై విద్యార్థులకు, సంబంధిత యాజమాన్యాలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు జిల్లాకు కూడా ఎన్నికలకు సంబంధించి కొంతసమయం కేటాయించాలని కాంగ్రెస్‌నాయకులు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. కార్యక్రమంలో సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

వీణవంక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికిచెందిన అన్వేష్ తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం కరీంనగర్‌కు వెళ్లి తన బావకి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేశాడు. వెంటనే అతడు తల్లిదండ్రులకు సమాచారం అందిచారు. వారు పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో ఫోన్‌నంబర్‌ను ట్రెస్‌చేసి పోలీసులు అన్వేష్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు వెంటనే స్పందించి యువకుడిని కాపడినందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎస్ఐకి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బండరాళ్లు పడి బాలుడి మృతి

బీర్‌పూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం రేకుపెల్లి గ్రామంలో ఆదివారం బండరాళ్లు పడి కడ ధనూష్(11) అనే బాలుడు మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపినవివరాల ప్రకారం కడ రాజేందర్-లక్ష్మి దంపతులు ఆదివారం తమ పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లారు. వారితో కుమారుడు ధనూష్, బంధువైన మరో బాలుడు అకీల్ వెళ్లారు. పొలం పక్కన కుప్పగా వేసి ఉన్న బండరాళ్ళపై కూర్చొని బాలురు ఆడుకుంటున్న క్రమంలో బండరాళ్ళు కదిలి జారి పడిపోయారు. దీంతో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గమణించిన రాజేందర్ జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ధనూష్ మృతి చెందాడు. అకీల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ధనూష్ తుంగూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. పోలీసులు విచారణ చేపడుతున్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు..

● ప్రారంభానికి నోచుకొని షాపింగ్ కాంప్లెక్స్

● దేవాదాయశాఖ ఆదాయానికి గండి


అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ భవనం

ఇల్లందకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన షాపింగ్‌కాంప్లెక్స్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. మండలకేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్‌పథకం కింద ఐదేళ్లక్రితం సీతారామచంద్ర స్వామి ఆలయసమీపంలో భక్తుల సౌకర్యార్థం షాపింగ్ కాంప్లెక్స్ భవనం నిర్మాణ పనులు రూ.50లక్షలతో చేపట్టారు. భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా నిధులు లేమితో పనులు నిలిచిపోయాయి. భవన నిర్మాణం పూర్తయితే 5షాపింగ్‌గదులు, పైఅంతస్తులో భక్తుల సౌకర్యార్థం అద్దెగదులు ఇచ్చేందుకు వీలువుగా ఉంటుంది. దీంతోపాటు దేవాదాయశాఖకు ఆదాయం కూడా సమకూరుతుంది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ భవనం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి మిగిలిన భవన నిర్మాణపనులకు నిధులు కేటాయించి ఉపయోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

● ఉపయోగంలోకి తెస్తాం..

- ఇంగిలే రామారావు, ఆలయ చైర్మన్, ఇల్లందకుంట



షాపింగ్‌కాంప్లెక్స్ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తాం. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకనిధులు కేటాయించేలా కృషిచేస్తాం. అతి త్వరలో మిగిలిన పనులు పూర్తిచేసి భక్తులకు ఉపయోగపడేలా చేస్తాం.

● నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి..

- కందుల సుధాకర్, ఆలయ ఈవో, ఇల్లందకుంట



భవన నిర్మాణం నిధులు లేక ఆగిపోయింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నావంతు కృషిచేస్తాను. దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు నిధుల కేటాయింపునకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేస్తాం.

పండుటాకులపై పట్టింపేదీ?

● వృద్ధుల డే కేర్ సెంటర్‌పై పర్యవేక్షణ కరువు

● ఊడిపోయిన సీలింగ్ రేకులు

● భయాందోళనలో వృద్ధులు



వృద్ధుల డేకేర్ సెంటర్ బోర్డుపై ఊడిపోయిన అక్షరాలు


కేంద్రంలో ధ్వంసమైన సీలింగ్

ఎల్లారెడ్డిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ వృద్ధుల డేకేర్ సెంటర్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిరాదరణకు గురైన వృద్ధులకు ఆశ్రయం కల్పించేలా ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ సమస్యలమయంగా మారింది. 18 మందికి నీడను అందించాల్సిన కేంద్రంలో ప్రస్తుతం ఐదుగురే ఉన్నారు. కేంద్రంలోని గోడకు వర్షపు నీటి జల్లు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. సీలింగ్ రేకులు ధ్వంసమయ్యాయి. అటువైపు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. అధికారుల పట్టింపులేనితనం వల్ల వృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఎప్పుడేం జరుగునోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వృద్ధులు వాపోతున్నారు.

● ఏఎన్ఎం పెద్ద దిక్కు

వృద్ధుల డే కేర్ సెంటర్‌ను ఆదునిక వసతులతో తీర్చిదిద్దారు. రెండేళ్ల కిందట అందుబాటులోకి వచ్చిన కేంద్రం నిరాదరణకు గురైనా ఎంతో మందిని అక్కున చేర్చుకుంది. ప్రస్తుతం కేంద్రంలో కో-ఆర్డినేటర్ మమత, ఏఎన్ఎం సుజాత, వంట మనిషితో పాటు ఒక సహాయకుడు విధులు నిర్వర్తిస్తున్నారు. కో-ఆర్డినేటర్ మమత తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోనూ బాధ్యతలను కొనసాగిస్తుండడంతో కేంద్రానికి ఏఎన్ఎం సుజాత పెద్దదిక్కుగా మారింది. వంట మనిషి ఉదయం భోజనం తయారుచేసి వెళ్లిపోతుంది. భారీ వర్షానికి భవనంలోని ఓ గోడ పైకప్పు నుంచి నీటి చుక్కలు పడుతున్నాయి. అటు వైపు వెళితే కాలు జారే ప్రమాదం నెలకొంది. సీలింగ్ రేకులు, బోర్డు ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృద్ధుల డే కేర్ సెంటర్‌పై ప్రత్యేక చొరవ చూపి మరమ్మత్తులు చేయించాలని వృద్ధులు కోరుతున్నారు.

● మరమ్మతు చేయిస్తాం..

- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

మండల కేంద్రంలోని వృద్ధుల ఆశ్రమం, డే కేర్ సెంటర్‌ను సందర్శించి సమస్యలను గుర్తిస్తాం. కోతుల వల్ల రేకులు, బోర్డుపై అక్షరాలు ధ్వంసమయ్యాయి. పైకప్పు నుంచి వర్షం నీరు రాకుండా మరమ్మతులు చేయిస్తాం. ఎల్లారెడ్డిపేట, మండేపల్లిలోని రెండు కేంద్రాల్లో మొత్తం 40 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నాం. కేంద్రంలోని వృద్ధులను వారం, పదిహేను రోజులకొకసారి రెండు కేంద్రాలకు అటుఇటు తీసుకెళుతుంటాం. ప్రస్తుతం ఎల్లారెడ్డిపేటలోని కేంద్రంలో ఐదుగురు ఆశ్రయం పొందుతున్నారు. కేంద్రంలో అన్ని వసతులు కల్పించి వృద్ధులకు ఏలోటు లేకుండా చూస్తాం.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తజనం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, కోడెమొక్కు క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతిరాజరాజేశ్వర స్వామివార లను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమ య్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఉప్పొంగుతున్న మూలవాగు



మామిడిపల్లి వద్ద పారుతున్న మూలవాగు

కోనరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూలవాగు ఉప్పొంగుతోంది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రాజెక్టు నుంచి వస్తున్న మూలవాగు నీరు ఆదివారం సాయంత్రం మామిడిపల్లి వరకు చేరుకుంది. దీంతో తహసీల్దార్ విజయలక్ష్మితో పాటు పలువురు అధికారులు మూలవాగును సందర్శించారు. కాగా, మూలవాగు పరిసర ప్రాంతాల రైతులు పూజలు నిర్వహించారు.

భారత్ విభూషణ్ పురస్కారాల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం మంథనికి చెందిన గౌతమి సాహితీ కళా సేవా సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ అధ్యక్షతన భారత్ విభూషణ్ జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానంచేశారు. ఈ సందర్భంగా శతాధిక గ్రంథప్రచురణకర్త, రచయిత వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ విభిన్న రంగాల్లో సేవలందిస్తున్నవారిని ప్రోత్సహించడంలో సంస్థ ముందంజలో ఉంటుందన్నారు. అంతకుముందు శ్రీధర్ సంపాద కత్వంలో వెలువడిన తల్లీ నీకు వందనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. చర్మవ్యాధి నిపుణురాలు, ప్రతిమ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గీతారెడ్డి, కవి పొర్ల వేణుగోపాలరావు, సామాజిక కార్యకర్త దీటి గోపాల కృష్ణయ్య (కడప), బ్యూటీషియన్ కుంచాల లావణ్య, సేంద్రీయ వ్యవసాయ పరిశోధకుడు యాదగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



భారత్ విభూషణ్ జాతీయస్థాయి పురస్కారాలు అందుకున్న రచయితలు

నిరుపయోగంగా వార సంతలు

- నిర్మించి రెండు సంవత్సరాలు గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాని వైనం
- పశువులకు, గ్రాసానికి, స్థానికుల అవసరాలకు ఉపయోగించుకుంటున్న స్థానికులు
- రూ. లక్షల నిధులు దుర్వినియోగం



మహాత్మానగర్ వారసంత

తిమ్మాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లో నిర్మించిన వారసంతలు నిరుపయోగంగా మారాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బాగంగా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మనగర్, నుస్తులాపూర్, రేణికుంట, నల్లగొండ, కొత్తపల్లి, మొగిళిపాలెం గ్రామాల్లో వార సంతలను నిర్మించేందుకు ప్రతిపాదించారు. వాటిలో మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో వార సంతల నిర్మాణం పూర్తయ్యాయి. నుస్తులాపూర్‌లో పనులను అర్ధాంతరంగా నిలిపి వేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించలేదు.

- మహాత్మానగర్ గ్రామ పంచాయితీని సమీపంలో 15లక్షల నిధులతో నిర్మించిన వార సంత అధ్వాన స్థితిలో ఉంది. 2023 అక్టోబరు 4న అప్పటి ఎమ్మెల్యే



రేణికుంటలో నిరుపయోగంగా ఉన్న వారసంత

వార సంతను అట్టహాసంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు ఒక్క రోజూ వారసంతలో కూరగాయాలు అమ్మలేదు. ప్రస్తుతం వార సంతలో స్థానికులు పశువులను కట్టేసుకుని పశుగ్రాసం నిల్వ ఉంచుకుంటున్నారు. గ్రామం లో కూరగాయలు రోడ్డు పక్కన విక్రయిస్తు న్నారు.

- రేణికుంటలో వార సంత నిర్మాణం పూర్తి అయినప్పటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో వారసంత ముందు కూర్చుని కూరగాయలు విక్రయించుకుంటున్నారు. నల్లగొండ గ్రామంలో నిర్మా ణం పూర్తయిన వార సంత కూడా ప్రారంభం కాలేదు.

● మానకొండూర్ మండలంలో..

మానకొండూర్: మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో నిర్మించిన వారసంత నిరుపయోగంగా మారింది. 2020-21 సంవత్సరంలో 12 లక్షలతో వారసంతను నిర్మించారు. ప్రారంభించి రెండేళ్లయినా వారసంత ఉపయోగంలోకి రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారసంతను ఉపయోగంలోకి తీసుక రావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసిన నుస్తులాపూర్‌లో వారసంత



నల్లగొండలో నిరుపయోగంగా ..

● ప్రజలకు అందుబాటులోకి తేవాలి

మహాత్మానగర్, నల్లగొండ, రేణికుంట గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంతలను తక్షణమే అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మహత్మానగర్ వార సంతను ప్రజలకు అనువైన స్థలంలో నిర్మించలేదని, రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వార సంత నిర్మించి ఉంటే ఇటు స్థానికంగా ఉంటే మత్యకారులకు, కూరగాయల విక్రయదారులకు ఉపయోగకరంగా ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వారసంతలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని పాదయాత్ర



మల్లాపూర్‌లో పాదయాత్రలో పాల్గొన్న పసుపుబోర్డు చైర్మన్ గంగారెడ్డి, బీజేపీ నాయకులు

మల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రం నుంచి ముత్యంపేట వరకు బీజేపీ ఆధ్వర్యంలో రైతులు పాద యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన నిజామాబాద్ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి ముఖం చాటేశారని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి కమిటీ వేశామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం నేటికీ హామీలు అమలుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలు సాగు చేద్దామంటే నీరు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు. అనంతరం బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, రైతులు మల్లాపూర్ నుంచి కుస్తాపూర్, సిర్పూర్, రాఘవపేట, హుస్సేన్‌నగర్, ముత్యంపేట గ్రామాల మీదుగా షుగర్ ఫ్యాక్టరీకి పాదయాత్రగా వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, చెట్నేని రఘు, ప్రశాంత్, సాయిరామ్, రమణ చారి, మల్లారెడ్డి, రాకేష్, సందీప్, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆగమైన ఉద్యోగుల బతుకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగుల బతుకులు ఆగమయ్యాయని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంప్లాయిస్ జేఏసీ జిల్లాచైర్మన్, టీఎన్‌జీవోస్ ఫంక్షన్‌హాలులో వ్యవసాయశాఖ మినిస్ట్రియల్ స్టాఫ్ అసోసియేషన్ (టీఏఎంఎస్ఏ) ఉమ్మడిజిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖలో ఉన్న క్యాడర్‌స్ట్రెంత్, విభాగసమస్యలు, ఉద్యోగుల సమస్యలు, సంఘానికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. అధికారులతో చర్చలు జరిపి పరిష్కరించేందుకు కృషిచేయాలని సంఘం నిర్ణయించింది. అనంతరం దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరుతో 33జిల్లాలుగా విభజన చేసి ఆర్డర్ టు సర్వీస్ పేరిట అర్ధరాత్రి వాట్సాప్‌లలో ఆర్డర్లు ఇస్తే వాటి ఆధారంగా జిల్లాలను ప్రారంభించినట్లు చెప్పారు. కొత్తజిల్లాలను ఏర్పాటు చేశారు కానీ క్యాడర్ స్ట్రెంత్‌ను పెంచలేదని, అశాస్త్రీయంగా జోన్లను విభజించి స్థానికతను పరిగణలోకి తీసుకోకుండా ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీనెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నారని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ, హెల్త్‌కార్డుల విషయంలో సరైన నిర్ణయం తీసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులు వేరు కాదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ సంక్షేమపథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి సమర్థంతంగా అమలు చేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు. అలాంటి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీల పేరిట కాలయాపన చేయకుండా సత్వరమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ మినిస్ట్రీయల్ ఉద్యోగుల కేంద్రసంఘం అధ్యక్షుడు శ్రీహరి, సెక్రెటరీ అరుణ్‌కుమార్, టీఎన్‌జీఓఎస్ జిల్లాసెక్రెటరీ సంగం లక్ష్మణ్ రావు, టాంసా జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, సెక్రెటరీ లవకుమార్, ఒంటెల రవీందర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలను అమలు చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్

గంభీరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్ స్కావెం జర్స్‌కు కనీసవేతనాలను అమలు చేయా లని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీటూపీజీ హైస్కూల్‌లో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ స్వీపర్, స్కావెంజర్స్‌కు 15వేలు కనీస వేతనాన్ని అమలు చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంబించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ జీతాలు రావడం లేదన్నారు. పాఠశాలలను శుభ్రపరుస్తున్నా వారి శ్రమను గుర్తించడం లేదని, ఇప్పటికైనా నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆదర్శ కమిటీలు రద్దు చేయాలని, కార్మికులుగా గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాల యూనిఫాం అమలు చేయాలని, 65ఏళ్లు నిండిన వారందరికి 9వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, దేవయ్య, మల్లేశం, మహేష్, లత, లావణ్య రజిత, సునిత, అనిత తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా పంచాయతీ కాంప్లెక్స్ భవన సముదాయం



నిరుపయోగంగా ఉన్న దుకాణ సముదాయం

రామడుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ దుకాణ సముదాయ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. బస్టాండ్‌లోనే భవనం ఉన్నా అద్దెకు ఉండడానికి వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు మూడుసార్లు అద్దెకు వేలం వేశారు. ఎవరూ ముందుకు రాలేదు. సముదాయంలో ప్రస్తుతం షాపునకు 3వేల రూపాయల అద్దెపెట్టడంతోపాటు ఒకేసంవత్సరం గడువు విధించడంతో వ్యాపారులు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తున్నది. అక్కడ ఏదైనా వ్యాపారం ప్రారంభిస్తే సంవత్సరం లోపు లాభాలు ఆర్జించే సమయంలో మరోసారి టెండర్లు వేస్తే తమకు తిరిగి వస్తుందో రాదోనని అనుమానంతో ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు వ్యాపారుల అభిప్రాయం తెలుసుకుని టెండర్లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దేశవ్యాప్తంగా 5 కోట్ల కేసులు పెండింగ్

కరీంనగర్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 5కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్‌ఫౌండర్, చైర్మన్ భగవాన్జిరేయన్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని కృషి భవన్‌లో ఫోరమ్ ఫర్ ఫాస్ట్ జస్టిస్ ఆధ్వర్యంలో కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లాల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ముంబాయికి చెందిన ఫోరమ్‌ఫర్‌ఫాస్ట్‌జస్టిస్ ఫౌండర్ చైర్మన్ భగవాన్జిరేయన్, కన్వీనర్ ప్రవీణ్‌పటేల్ మాట్లాడుతూ తెలంగాణలో 11లక్షల పైచిలుకు కేసులు ఉండగా కరీంనగర్ జిల్లాకు సంబంధించి 38,600కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు తీసుకునేచర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లాన్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీని వాస్‌రావు, మంచిర్యాల జిల్లా న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు జగన్, సుల్తానాబాద్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు అనుమతి వచ్చేనా..!

- వైద్య కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు
- పీజీ కోర్సులకు దరఖాస్తు
- 24 సీట్ల కోసం రూ.94 లక్షలు డిపాజిట్

కళ్యాణ్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పీజీ కోర్సుల కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు అనుమతులు రావడం లేదు. కళాశాల ప్రారంభమై నాలుగేళ్లవుతున్నా పీజీ కోర్సులు ఏర్పాటు చేయడంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలను చేపట్టలేదు. సింగరేణి మెడికల్ కళాశాలకు అనుబంధంగా 365 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికీ ఆసుపత్రితోపాటు మరో 345పడకల ఐదు అంతస్థుల భవన నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నది. ఈ ఏడాది చివరికల్లా భవనాన్ని ప్రారంభించాలని, అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆరు విభాగాల్లో పీజీ కోర్సులను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితం కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు దరఖాస్తు చేశారు. సిమ్స్ కళాశాలలో పీజీ సీట్లను కేటాయించడానికి జాతీయ వైద్య విద్య కమిషన్ అంగీకరించినప్పటికీ దీనిపై స్పష్టత రాలేదు. ఆరువిభాగాల్లో 24సీట్ల కోసం ప్రభుత్వం రూ.94లక్షలు కలెక్టర్ డిపాజిట్‌ను కూడా చేసి నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు పంపారు. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కూడా సిమ్స్‌కు 24సీట్లు కేటాయించాలని నివేదికను కూడా పంపారు.

● ఆరు పీజీ కోర్సులకు దరఖాస్తు

ఈ ఏడాది సిమ్స్ మెడికల్ కళాశాలలో 4వ సంవత్సరం క్లాసులు అక్టోబరులో ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు 4వ సంవత్సరం పూర్తి చేసిన తరువాత పీజీ సీట్ల కోసం పోటీ పడతారు. ప్రభుత్వ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో సీటు వస్తే సుమారు కోటి రూపాయల వరకు ఆదా అవుతుంది. ఎమర్జెన్సీ మెడిసిన్ 4సీట్లు, ఆర్థో 4సీట్లు, గైనకాలజీ 4సీట్లు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ 4సీట్లు, పిడియాట్రిక్ 4సీట్లు మొత్తం 24సీట్ల కోసం దరఖాస్తు చేశారు. మొదటి సంవత్సరం 24సీట్లు మంజూరైతే ఇక్కడ వైద్య విద్యార్థుల సంఖ్య



సిమ్స్ మెడికల్ కళాశాల ముఖ ద్వారం

పెరిగే అవకాశం ఉంటుంది. సిమ్స్ మెడికల్ కళాశాలలో ఇప్పటికే 15శాతం ఆల్ ఇండియా కోటా సీట్లతో ఇతర రాష్ట్ర విద్యార్థులు ఈ కళాశాలలో చేరేందుకు పోటీ పడుతున్నారు.

● సింగరేణి నిధులతో సిమ్స్ కళాశాల ఏర్పాటు

సింగరేణి రూ.520కోట్లతో సిమ్స్ మెడికల్ కళాశాలకు కేటాయించింది. ఈ కళాశాల 2022-23లో ప్రారంభం కాగా 150సీట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 15శాతం ఆల్ ఇండియా కోటాకు గాను మిగతా 7శాతం సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించగా, మిగతా 78శాతం రాష్ట్ర కోటాకు కేటాయించింది. అన్నీ వసతులు సింగరేణి మెడికల్ కళాశాలలో చేరడానికి విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

● పీజీ కళాశాలను పెద్దపల్లిలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు...

కొత్తగా ప్రభుత్వం 15పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుండగా పెద్దపల్లిలో వంద పడకల ఆసుపత్రి మాత్రమే ఉన్నది. రామగుండంలో ఏర్పాటు చేస్తే ఇటు వైద్య విద్యార్థులతోపాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా ఉపయోగం ఉంటుంది. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు 1500 నుంచి 1800మంది రోగులు వైద్య చికిత్సల కోసం వస్తుండడంతో పాటు ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దీనికి తోడు కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ పీజీ కోర్సులు వస్తే యేటా 25నుంచి 30సీట్లు పెరిగే అవకాశం ఉంది.

ఆగస్టులో అనుమతులు వచ్చే అవకాశం...

- ప్రిన్సిపాల్ హిమబిందు



సిమ్స్ కళాశాలలో పీజీ సీట్ల కోసం రూ.94లక్షలు డిపాజిట్ చేశాం. ఆగస్టులో అనుమతులు లభిస్తాయనే ఆశిస్తున్నాం. గత ఏడాదిలోనే రావాల్సి ఉంది. ఆర్థో, ఎమర్జెన్సీ మెడిసిన్, గైనకాలజీ, పిడియాట్రిక్, జనరల్ సర్జన్ విభాగాలకు దరఖాస్తు చేశాం. ఈ ఏడాది 4వ సంవత్సరం అడ్మిషన్లు కూడా ప్రారంభం కానున్నాయి. సిమ్స్‌లో 600మంది విద్యార్థులు ఈ ఏడాదితో విద్యను అభ్యసించనున్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు

● పట్టించుకోని అధికారులు



ఇల్లందకుంటలో బస్ షెల్టర్ లేక చెట్ల కింద ఉన్న ప్రయాణికులు

ఇల్లందకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిలువ నీడ లేక పాట్లు పడుతున్నారు. బస్సులకోసం గంటల తరబడి రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నారు. ఇల్లందకుంట మండలంగా ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. సీతారామచంద్ర స్వామిదర్శనానికి వరంగల్, భూపాలపల్లి, సింగరేణి ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఇక్కడికి వస్తారు. వారు తిరుగు ప్రయాణం చేసే సమయంలో బస్సులకోసం గంటలతరబడి ఎండలోనే రోడ్డుపై నిలబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండకూ ఎండుతూ వానకు తడుస్తూ బస్సులు వచ్చేవరకు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తుంది. బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా. ప్రజాప్రతినిధులు మారుతున్నా మండల కేంద్రంలో బస్‌షెల్టర్ కల నెరవేరడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

● ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

- కందాల కొంరెల్లి, ఇల్లందకుంట



మండల కేంద్రానికి వివిధ పనుల కోసం ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల చెట్ల కింద రోడ్డుపైన బస్‌కోసం నిలబడాల్సి వస్తోంది. అధికారులు వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలి.

వన భోజన మహోత్సవం

రాయికల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మూటపెల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఆషాఢ మాస వన భోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 100 మంది కుటుంబసభ్యులంతా కలిసి ఒకే చోట చేరి ఆట, పాటలతో సరదాగా గడిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు జిల్లా లావణ్య, ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి స్వప్న, కోశాధికారి అయిత మాధవి పాల్గొన్నారు.

పోలీసుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం 1989 బ్యాచ్‌కు చెందిన పోలీస్ మిత్రులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తొలి నాళ్ల ఉద్యోగ విధులు, సాధించిన అవార్డులు, రివార్డులను నెమరువేసుకున్నారు. అనంతరం తమ కుటుంబాల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఇంటలీజెన్స్ జోనల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, ఎస్‌బీ ఏఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వావిలాల గంగాధర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలి

కొడిమ్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాలతో పల్లెపల్లెకు కాంగ్రెస్ జెండా- సబ్బండవర్గాలకు తెలంగాణ ప్రజాప్రభుత్వం అండ కార్యక్రమంలో బాగంగా జెండాను ఆవిష్కరించారు. మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ కోనాపూర్ గామ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆరుకోట్ల రూపాయలతో బ్రిడ్జ్, రోడ్డు నిర్మాణానికి 6కోట్ల రూపాయలను మంజూరు చేయించారన్నారు. విద్యుత్ కోతను నివారించడానికి నూతన సబ్ స్టేషన్ మంజూరు చేయించారన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

గుంతలను పూడ్చిన మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లిటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాలలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా నేషనల్ హైవే రోడ్డుపై పలు ప్రదేశాలలో ఏర్పడిన గుంతలను గుర్తించి సిమెంట్ కంకర వేయించడం జరిగిందని అలాగే బస్ డిపో, మయూరి హోటల్, పాత బస్టాండ్, పోలీస్‌స్టేషన్‌ల దగ్గర రోడ్డుపై గుంతలను సిమెంట్ కంకర పోసి పూడ్చడం జరిగిందని తెలిపారు. వార్డులలో ఏర్పడిన గుంతలను గుర్తించి మొరం పోయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముజీబ్ లింబాద్రి పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రయాణ ప్రాంగణం

-పట్టించుకోని అధికారులు -ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మొగిలిపేటలో స్లాబ్ పై పెచ్చులు ఊడిన ప్రయాణ ప్రాంగణం

మల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామ ప్రయాణ ప్రాంగణం శిథిలావస్థకు చేరుకుంది. భవనం దెబ్బతిని పై పెచ్చులు ఊడి ప్రయాణికులపై పడుతున్నాయి. అయినా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రయాణికులు వాపోతున్నారు. ముప్పై ఏండ్ల క్రితం గ్రామస్థులంతా ఏకమై ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం బస్సుల కోసం బస్టాండ్‌లో నిల్చుంటే ఏ సమయంలో ఏం జరుగుతుందోనని వారు భయపడుతున్నారు. భవనం పై పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎండాకాలం, వాన కురిసిన సమయంలో ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చోడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొగిలిపేట గ్రామంలో ప్రధాన బ్యాంకులు, కార్యాలయాలు ఉన్నాయి. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆయా కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. మెట్‌పల్లి నుంచి ఖానాపూర్, నిర్మల్ జిల్లాకు వెళ్లాల్సిన బస్సులకు గ్రామంలోని బస్టాండ్ వద్ద అగి ప్రయాణికులను తీసుకెళ్తాయి. రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత అధికారులు మౌనంగా ఉండడంపై ప్రయాణికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో కూర్చోవాలంటే భయంగా ఉంది

-పిట్ల సాయిరాం, మొగిలిపేట వాసి

ఊరికి పోయేటప్పుడు బస్సు కోసం బస్టాండ్‌లో కూర్చోవలంటే ఎప్పుడు పెచ్చు కూలి మీద పడుతుందోనని చాలా భయంగా ఉంది. బస్టాండ్‌లో చెత్తతో ఉంది. ఊరికి వచ్చిపోయేటోళ్లు ఎండకు, వానకు మరింత బాధ పడుతున్నరు. ఇప్పటికైనా బస్టాండ్‌ను మంచిగా చేపియాలి.

మరమ్మతు చేయించాలి..

- శివరాత్రి వెంకటేష్, మొగిలిపేట

బస్టాండ్‌పై అధికారులు శ్రద్ధ తీసుకొని బాగు చేయించాలి. బస్సు కోసం నిలబడుదామంటే ఇబ్బందిగా ఉంది. గతంలో గ్రామంలో కష్టమవుతుందని యువజన సంఘం సభ్యులు కట్టించారు. కూళ్తున్న బస్టాండ్‌ను మంచిగా చేపియాలి. ఇప్పటికైనా ఎవరో ఒకరు శ్రద్ధ తీసుకోవాలి.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

కొడిమ్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని ఆదివారం మండల కేంద్రంలోని తూర్పు, పడమటివాడ రైతులు మండలంలోని బొల్లోనిచెరువు గ్రామ సమీపంలోని కనికెలమ్మ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళా రైతులు బతుకమ్మ ఆట ఆడారు. రైతులు వండిన పాయసం బండపై పోసి నాకుతూ వర్షాలు కురువాలని కనికెలమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భోజనాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో రెండు రెడ్డి సంఘాల కార్యవర్గం, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అభివృద్ధికి ఆమడదూరంలో గిరిజన గ్రామం

-సీసీ రోడ్లు, మౌలిక వసతులు లేక కందెనకుంట గ్రామస్థుల ఇక్కట్లు



ఒకే భవనంలో కొనసాగుతున్న మూడు కార్యాలయాలు

బీర్‌పూర్,జూలై 20(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం కందెనకుంట గిరిజన గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 సంవత్సరంలో గిరిజన తండాలను, గూడాలను నూతన గ్రామ పంచాయతీలుగా ప్రకటించింది. ఈక్రమంలో బీర్‌పూర్ మండలంలోని కందెనకుంట గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. అప్పటి నుండి నూతనంగా ఏర్పడిన అన్ని గ్రామాలకు ఎంతో కొంత కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా కందెనకుంట గ్రామం మాత్రం అభివృద్ధి చెందలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడిన తరువాత కూడా ఒకే భవనంలో మూడు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. కందెనకుంట గ్రామంలో 370 మంది జనాభా ఉండగా 226 మంది ఓటర్లు ఉన్నారు. వీరిక తాగడానికి నీటి సౌకర్యం లేదు. పేరుకు మాత్రం మిషన్ భగీరథ ట్యాంక్ కట్టి ప్రతి ఇంటి వాకిలి వరకు పైపు లైన్లు తీసి వదిలేశారు. గ్రామ పంచాయతీగా ఏర్పడి సుమారుగా ఎనిమిదేళ్ళు గడుస్తున్నా కనీసం మురికి కాలువలు, సీసీ రోడ్లు లేవు. వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామస్థుల బాధలు వర్ణనాతీతం. ఆ గ్రామం గుండా ట్రాక్టర్లు, కేజ్‌వీల్స్ రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్లన్నీ బురద మయంగా మారుతుంటాయి. వర్షాకాలం వర్షపు నీరు ఇళ్ల చుట్టు చేరి దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి కందెనకుంట గ్రామంలో సీసీ రోడ్లు వేసి మురికి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాజారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఏదులాపురం మహేందర్ ఆధ్వర్యంలో కరీంనగర్, జగిత్యాలకు చెందిన అపెక్స్ ఆసుపత్రి, కరీంనగర్ ఆద్య చిల్డ్రెన్ ఆసుపత్రి వైద్య బృందం సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో 350 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అఖిల్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ అంద్రూసన్, ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదులాపురం మహేందర్, పుప్పాల భాస్కర్, రాకేష్, నాయకులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

వెల్గటూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావు పేట గ్రామంకు చెందిన దళిత యువకుడు సల్లూరి మల్లేశంను హత్య చేసిన ఆధిపత్య కులాలకు చెందిన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్ చేశారు. కిషన్‌రావుపేటలో హత్యకు గురైన సల్లూరి మల్లేశం కుటుంబాన్ని కేవీపీఎస్ రాష్ట్ర బృందం ఆదివారం పరామర్శించింది. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొడిమ్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-1982 విద్యా సంవత్సరంలో 10వతరగతి చదివిన విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని అక్షయగార్డెన్‌లో జరిగింది. మండలంలోని రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013-2014 పదవతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని నాచుపల్లి బృందావనం గార్డెన్‌లో రీయూనియన్ పేరిట జరిగింది.

ఉపాధ్యాయుల 'సర్దుబాటు' వివాదం

(ఐదో పేజీ తరువాయి)

పూర్తి చేస్తేనే విద్యార్థులకు అన్ని పాఠ్యాంశాల బోధన అందుబాటులోకి వస్తుందని వారు అంటున్నారు. అయితే కొంత మంది ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉండే పాఠశాలకు సర్దుబాటులో వెళ్లేందుకు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో జిల్లా అధికారులకు సిఫారసు లేఖలు, ఫోన్లు చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కొంత మంది ఉపాధ్యాయులు తప్పుడు సమాచారాన్ని జొప్పిస్తూ తమకు అనుకూలంగా సర్దుబాటు జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● నిబంధనలు ఇలా..

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రతీ 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. విద్యార్థుల సంఖ్య ఒకటి నుంచి పది వరకు ఉంటే ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 61 నుంచి 90 వరకు ముగ్గురు ఉపాధ్యాయులు, 91 నుంచి 120 వరకు నలుగురు ఉపాధ్యాయులు,

121 నుంచి 150 వరకు ఐదుగురు ఉపాధ్యాయులు, 151 నుంచి 200 వరకు ఆరుగురు ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే సందర్భాల్లో నాలుగు స్టేజీల్లో నిబంధనలు పాటించాల్సి ఉంటుందని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. మొదటి దశలో రెండు ఉన్నత పాఠశాలలు ఒకే ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లయితే ఒక స్కూల్‌గా పరిగణనలోకి తీసుకోవాలని అంటున్నారు. రెండో దశలో ఒకే గ్రామ పంచాయతీ పరిధిలో గాని, ఒకే స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గాని సర్దుబాటు చేయాలని, మూడో దశలో ఒకే మండలం పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్‌లలో, నాల్గవ దశలో సమీప మండంలోని గాని, జిల్లాలోని ఇతర మండలాల్లో గాని ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు సందర్భంగా విద్యార్థుల సంఖ్యను బట్టి సబ్జెక్టుల వారీగా జాబితాను రూపొందించాల్సి ఉంటుందన్న అభిప్రాయాలున్నాయి.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే..

-రాము, జిల్లా విద్యాశాఖ అధికారి



ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు సర్దుబాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎంఈవోలు క్షేత్ర స్థాయిలో అవసరాన్ని గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు, ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం నిర్ణయం తీసుకున్నాం. అన్ని ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ అన్ని సబ్జెక్టుల్లో బోధన సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. సర్దుబాటులో ఉపాధ్యాయులు విధిగా జిల్లా అధికారుల ఆదేశాలు పాటించాలి.

ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా రాజేష్



ఎన్నికైన మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

ధర్మపురి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా చీపిరిశెట్టి రాజేష్ ఎన్నికయ్యారు. స్థానిక మున్నూరుకాపు సంఘ భవనంలో సభ్యులు సమావేశం జరిపి ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. చీపిరిశెట్టి రాజేష్ తన సమీప ప్రత్యర్థి లసెట్టి మహేష్‌పై 51 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి చెరుకు రాజన్న ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బండి మహేష్, ఉపాధ్యక్షులుగా చల్ల రవి, ముత్తినేని లక్ష్మణ్, కోశాధికారిగా బుక మహేష్, కార్యదర్శులుగా పానుగంటి రవి, బుక శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా సంగి రాజన్న, బుట్టి మహేష్, మరో 15 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. అధ్యక్షులు రాజేష్ సంఘం అభివృద్ధి కోసం తన వంతుగా రూ.50వేలు విరాళాలు ప్రకటించారు.

కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగట్టాలి

వెల్గటూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోస పూరిత హామీలను ఎండగట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కోటిలింగాల గ్రామంలో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసహాయం అభినందనీయం



వైద్య విద్యార్థిని ప్రనూషకు చెక్కును అందిస్తున్న నాయకులు

మెట్‌పల్లి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పేద వైద్య విద్యార్థిని ప్రనూషకు ప్రముఖ న్యాయవాది, బీజేపీ నేత బద్దం గంగాధర్ ఆర్థిక సహాయం చేయడం నిలవడం అభినందనీయమని మెట్‌పల్లి బీజేవైయం సీనియర్ నాయకులు గాజెంగి జయ కృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద వైద్య విద్యార్థిని అచ్చ ప్రనూషకు మెట్‌పల్లికి చెందిన న్యాయవాది బద్దం గంగాధర్ ప్రకటించిన ఆర్థిక సహాయ చెక్కును బీజేవైయం సీనియర్ నాయకులు గాజెంగి జయ కృష్ణ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ ప్రముఖ్ ఆకు రాజేందర్, ఉపాధ్యాయులు ఆకుతోట నరేశ్, మర్రి మహేశ్, అచ్చ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గడి గురుజు ప్రాంతంలో కట్టడాలకు అనుమతి

కోరుట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గడి గురుజు ప్రాంతంలో నూతన కట్టడాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి జీవోను మంజూరు చేసినట్లు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడారు. ఫిబ్రవరి 12వ తేదీ 2025 రోజున ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి స్థానికంగా గురుజు పరిస్థితిని వివరించి నూతన కట్టడాలకు అనుమతులు కల్పించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. స్పందించిన మంత్రి గడి గురుజు ప్రాంతంలో 15 ఫీట్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు ఇతర కార్యకలాపాలు అనుమతు ఇవ్వవద్దని ఆదేశాలను జారీ చేసినట్లు తెలిపారు. మిగితా ప్రాంతంలో 15 ఫీట్ల పరిధి దాటి ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతులు జారీ చేయాలని వాటికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్, కోరుట్ల మున్సిపల్ కమీషనర్‌కు సీఎస్ రంజన్ ఆర్డినెన్స్ జారి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ సత్తా చాటాలి

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలేందర్

గొల్లపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని బీఆర్ఎస్ సత్తాను చాటాలని పార్టీ మండల శాఖ అధ్యక్షులు గోస్కుల జలేందర్ పార్టీ స్థానిక శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామంలో పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి కార్యకర్తల విస్తృతాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జలేందర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సమిష్టిగా పార్టీ అభ్యర్థుల కోసం పని చేసి విజయతీరాలను చేరాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ నక్క శంకరయ్య, మాజీ ఎఎంసీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షులు బలభక్తుల కిషన్, మాజీ పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొల్లం రమేష్, ప్యాక్స్ చైర్మన్ గందె వెంకట మాధవరావు, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు ఓరగంటి అశోక్ రావు, మాజీ ప్రజా ప్రతినిధులు అలిశెట్టి రవీందర్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

కొడిమ్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి) : రాబోయె స్థాని ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జిల్లా బీజేపీ నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి కార్యకర్తలను కోరారు. ఆదివారం మండలంలోని చెప్యాల గ్రామంలో బీజేపీ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు బండ నర్సింహరెడ్డి, నాయకులు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, వడ్లకొండ బుచ్చిరాములు, అక్కపెల్లి రవీందర్, నాగరాజు, సుదీర్‌రెడ్డి, శేఖర్, నాగభూషణాచారి, అంజయ్య, శ్రీనివాస్, శ్రీధర్, గౌతంరెడ్డి, కొమురయ్య, పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

బుగ్గారం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన కొత్త గోవిందుల నాగభూషణం రోడ్డు ప్రమాదంలో కుడి కాలును తొలగించగా మాజీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారిని పరామర్శించి సానుభూతి తెలిపి వారిని ఆదుకుంటామని తెలిపారు. అనంతరం గోపులాపూర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్మినేని కొమురయ్య అనారోగ్యంతో బాధపడడం తో వారిని పరామర్శించి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్, మాజీ మండల అధ్యక్షులు సిర్నేని మల్లేశం, మాజీ మండల కో ఆప్షన్ అబ్దుల్ రహమాన్, నాయకులు కళ్లెం మోహన్, ఉరుమెట్ల బుచ్చయ్య పాల్గొన్నారు.

'చలో గన్‌పార్క్'ను విజయవంతం చేయండి

కొడిమ్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులు తమ హక్కుల కోసం ఈ నెల 22న హైదరాబాదులో టీయూఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో గన్ పార్క్ నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏనుగు మల్లారెడ్డి కోరారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవటంలో విఫలమైందన్నారు. అధికారం రాక ముందు ఉద్యమ నాయకులను కలిసి తాము అధికారంలోకి రాగానె అన్ని రకాలుగా ఆదుకుంటామని మెనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏర్పాటు చేస్తూ, అర్హులైన వారికి 250 గజాల స్థలం ఇవ్వాలన్నారు.చలో గన్‌పార్క్ నిరసన కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, ఉద్యమ, విద్యార్థి, కళాకారుల సంఘాలు హాజరై మద్దతు తెలుపాలని ఆయన కోరారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల

-స్వంత ఖర్చులతో పాఠశాలకు రంగులు వేయించిన ఉపాధ్యాయుడు



రంగులతో ఆకర్షిస్తున్న పాఠశాల తరగతి గది

కొడిమ్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంద్రల్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రైవేటుకు దీటుగా ఉపాధ్యాయుడు స్వంత ఖర్చులతో 70వేల రూపాయలు వెచ్చించి విభిన్న రంగులు వేయించాడు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నిర్వహిస్తున్న పాఠశాలలో 31మంది విద్యార్థులు రెండు గదుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు కల్లెడ అశోక్ కుమార్, జి.స్వర్ణ విధులు నిర్వహిస్తున్నారు. సంద్రల్లపల్లి ప్రాథమిక పాఠశాల చుట్టు గోడలు, బయట గోడలు ఆకర్షనీయమైన రంగులతో ఆకట్టుకుంటున్నాయి. గోడలపై వేసిన రంగులపై తెలుగు, ఇంగ్లీష్, అక్షరమాల, తెలుగు, ఇంగ్లీష్ అంకెలు, చిన్న చిన్న పదాలతో నీతి వాక్యాలు, చిన్న పిల్లలకు ఉపయోగ పడు సాదారణ అంశాలు గోడలపై రాయించారు. పండ్లు, కూరగాయల బొమ్మలతో గోడలు ఆకర్షణగా నిలిచాయి. ప్రైవేటు పాఠశాలకు దీటుగా బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. తాగు నీటి వసతి, మరుగుదొడ్ల వసతులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయగా విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల విద్యాశాఖ జిల్లా అధికారి పాఠశాలను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

విద్యార్థుల కోసమే

-ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్



చదువుపై విద్యార్థులకు అవగాహన పెంచడానికి స్వంత డబ్బుతో పాఠశాలకు రంగులను వేయించాను. గోడలకు వేసిన రంగులపై చిన్న పిల్లల మనస్సులో నాటుకుపోయే విదంగా అక్షరాలను, అంకెలను నీతి వాక్యాలను రాయించాను. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి గ్రామస్థుల సహకారం తీసుకుంటున్నా.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



నృత్యాలు చేస్తున్న అల్ఫోర్స్ విద్యార్థినులు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జోష్ పేరుతో నిర్వహించిన సాంస్కృతిక వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సరస్వతి మాత చిత్రపటానికి పూజ నిర్వహించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక స్పృహతో పాటు, పలు కళల పట్ల అవగాహన కల్పించాలన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికీ సాంస్కృతిక కార్యక్రమాల పట్ల కనీస అవగాహన ఉండడమే కాకుండా వాటిలో పాల్గొనేందుకు ఉత్సాహం ప్రదర్శించి పాల్గొని ఉపశమనం పొందాలని వారు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించిన వారమవుతామన్నారు. 1991లో ప్రారంభమైన అల్ఫోర్స్ విద్యాసంస్థలు నేటికీ తరగని ఉత్సాహంతో విద్యార్థులకు రెట్టింపైన నాణ్యతతో విద్యను అందిస్తూ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసిందన్నారు. ఇటీవల కాలంలో పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలలో, ఎన్ఐటీలలో ఐఐఐటీ, ఎయిమ్స్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు వారి పోషకులను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక వేడుకల సందర్భంగా విద్యార్థులచే ప్రదర్శించ బడిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోని, ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో 'జ్యోతి' విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 6వతరగతి విద్యార్థిని రిశ్విత ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మాథమాటిక్స్ ఒలంపియాడ్(ఐఎంఓ)లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన రాష్ట్రంలో 7వ ర్యాంకు, జిల్లా స్థాయిలో 1వ ర్యాంకు సాధించిన స్కూల్‌కు, జిల్లాకి గర్వకారణంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు విద్యార్థిని రిశ్వితను సన్మానించారు. ఆమెకి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం, క్యాష్‌ప్రైజ్, చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలడైరెక్టర్‌లు బియాల హరి చరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత పాల్గొన్నారు.

మండల స్వర్ణకార సంఘం కార్యవర్గం ఎంపిక

కథలాపూర్, జూలై 20 (ఆంధ్ర జ్యోతి) : మండలం స్వర్ణకార సంఘ నూతనకార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని శుక్ర వార దేవాలయం వద్ద జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడుగా దర్మపురి జలందర్, ఉపాధ్యక్షులుగా ఉరుమల కృష్ణామాచారీ, ప్రధాన కార్యదర్శిగా వేగ్యరపు మనోహర్, కోశాధికారిగా ఉరుమల్లకిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడుగా శ్రీరాముల ప్రకాష్, కార్యవర్గ సభ్యులుగా దురిశెట్టి కర్ణాకర్, బెజారపు అంజనేయులు, ఇందూరిప్రతాప్, వేగ్యారపు ఆంజనేయులు, బెజ్జారపున రేష్‌లను ఎన్నకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. నూతనంగా ఏర్పాడిన సభ్యులనుసంఘసభ్యులు సన్మానించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

మల్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమల చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆ పార్టీ మండల నాయకులు సూచించారు. ఆదివారం మండలంలోని ఓబులాపూర్, రాంపూర్ గ్రామాల్లో పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమంను నిర్వహించారు.